# ఓ చిలక కథ !

గోరింకతో జత కట్టిందన్న మాటేకాని, జత కట్టిన సంతోషం - సరదా ఏం కనిపించడం లేదు చిలక మొహంలో. మనస్సులో ఏదో అసంతృప్తి. కళ్ళలో ఇదీ అని చెప్పలేని నిర్లిప్తం. తన చుట్టూ ఎగురుతూ, మధ్య మధ్య ముక్కుతో తనని గోరింక కవ్విస్తున్నప్పుడు బాగానే వుంటోందికాని, ఏవిటో ఆ నల్లని వళ్ళు చూస్తే మాత్రం. ఆ హాయి ఇట్టే మాయం అయిపోతోంది. తొందరపడి ఈ నల్లని గోరింకతో జత కట్టానా? ఇంతకంటే అందమైన జతగాళ్ళు దొరక్కపోదురా తనకి ?

చిలక మనస్సు ఇంకా సర్దుకోనేలేదు. గోరింక గూడు కట్టడం ప్రారంభించింది. అంతగా మనస్సు లేదేమో, ఆ కట్టడంలో చిలక ఎక్కువగా సాయం చెయ్యలేకపోయింది. అలా తుర్రున ఎగిరి ఇలా ఓ పుల్లో, పుడకో ముక్కున కరుచుకుని గోరింక తెస్తూ వుంటే, పక్కకొమ్మమీద ఉయ్యాలూగుతూ చూస్తూ వూరుకుందే కాని, గట్టిగా చెయ్యి ఆసరా చెయ్యలేదు చిలక. కానయితే పూర్తిగా ఊరుకోకుండా, అప్పుడప్పుడు ముక్కుతో ఆ గడ్డి పరకని ఇటు సర్దినట్టూ ఈ ఆకుని అటు సర్దినట్టూ సర్ది, నేనూ గూడుకట్టడంలో సాయం చేశాననిపించింది.

అలా చిరుసాయం చేసిందేకాని, తీరా గూడు పూర్త అయేసరికి, చిలక మూతి మూడు వంకర్లు తిప్పింది. "ఏవిటీ గూడు? ఎప్పుడో తన చిన్నప్పుడు ఆటల్లో కట్టినట్టు? గోరింకకి ఈ మాత్రం అలోచనలేకపోతే ఎలా? ఇంత చిన్న గూడు తమ ఇద్దరికీ ఎలా సరిపోతుంది? రేప్పొద్దున్న పిల్లలు పుడితే?" ఈ ఆలోచనతో చిలక్కి సిగ్గేసి ముక్కంతా ఎర్రబడింది.

ఏమైనా చిలక మనస్సు చిన్నబోయింది.

జోడు అంతగా నచ్చకపోయినా పోనీ, ఏదో మనస్సు సరిపెట్టుకుందాం అంటే గూడు కూడా అలాగే అయింది.

ఉత్సాహం ఏంలేకుండా గూడుచివర్ని ఆ మూల మూతి ముడుచుకుని కూర్చుంది. ఉలుకూ పలుకూ లేకుండా కూర్చున్న చిలకని చూసి ఏం అర్థంకాక కాస్సేపు గోరింక కూడా అమట్టునే కూర్చుంది. తర్వాత ఎలాగైనా చిలకని

నవ్వించాలనే కోరిక బయలుదేరింది. దాంతో ఏవేవో సరదా కబుర్లు చెప్పసాగింది. అలా కొంచెం సేపు చెప్పిన తర్వాత తన చిన్ననాటి అనుభవాలు వర్ణించ నారంభించింది, మధ్య మధ్య రెక్కల్ని ముక్కుతో దువ్వుకుంటూ. గోరింక చెబుతున్న కబుర్లని చిలక ఓ రకంగా వింటోంది, ఓ రకంగా వినడం లేదు. గూట్లోంచి మెడ బయటికి సారించి ఏక దిక్కులు చూస్తోంది. అప్పుడప్పుడు మాత్రం కళ్ళ చివర్నుంచి గోరింకని పరిశీలిస్తోంది.

కబుర్లమధ్యలో గోరింక తలఎత్తి చిలకని ముక్కుతో పొడిచింది-"ఏయ్? విన్నావా?" అన్నట్టు.

చిలక పలకలేదు సరిగదా, గోరింక కేసి ఓరగా చూసి మూతి తిప్పి, మళ్ళీ బయట ప్రకృతిని చూడసాగింది. నీలంగా వున్న ఆకాశంమీంచి నల్లని మబ్బులు పరిగెడుతున్నాయి. చల్లగా వీస్తూన్న గాలికి కొమ్మలూ తీగెలూ మెల్లగా తలలూపు తున్నాయి. కొమ్మలమీద ఉయ్యాలలూగుతూన్న పిచుకలూ పిట్టలూ కూనిరాగాలు తీస్తున్నాయి.

"ఇదిగో! ఓయ్! నిన్నేనోయ్!" అని పిలిచి, పక పకా నవ్వి, "వాన వస్తుందని భయమా?" అనడిగింది గోరింక.

ఉహు ....చిలక ఈ మారూ మాట్లాడలేదు.

గోరింక చిరుగుండె దడదడ లాడింది.

"జోడు కూడింది కదా అని ఇంతా గూడు కడితే ఈ వయ్యారా లేవిటి? మనస్సులో మాట చెప్పొచ్చు కదా?"

"నేనంటే మనసుంది కదూ?" అడిగింది గోరింక.

చిలక తల కూడా తిప్పకుండా ప్రకృతిలోకి చూస్తూ వుండిపోయింది. గాలి చల్లగా వీస్తూ ఉండుండి వంటికి తాకి హాయిగా మురిపిస్తోంది. అటు ఎర్రగా సూర్యుడు అస్తమిస్తున్నాడు. ఇటు నల్లగా మబ్బులు ఆకాశాన్నాక్రమించుకొంటు న్నాయి. నల్లమబ్బుల క్రింద తెల్లని కొంగల బారులు.

అల్లనేరేడుపళ్ళూ-ఎర్ర జాంపళ్ళూ - తెల్లజామి పువ్వులూ.

తనలోతను నవ్వుకొంది చిలక.

"ఎందుకు నవ్వావు?" దగ్గరగా వచ్చి సానునయంగా అడిగింది గోరింక.

"అదిగో అటుచూడు" అంటూ ఎరుపూ, నలుపూ కలనేతగా వున్న ఆకాశం కిందనుంచి వెళుతూన్న తెల్లకొంగల బారుల్ని చూపించింది చిలక. గోరింకకి అందులో ప్రత్యేకత ఏమిటో అర్థం కాలేదు.

అందుకే 'ఉహూ' అని వూరుకుంది.

ఇంతలో కూ.... కూ.... అని పంచమ స్వరం ఒకటి వినిపించింది. "ఎక్కడనుంచా?" అని ఆశ్చర్యంతో ఆనందంగా చెవులు రిక్కించి మరీ వింది చిలక.

గోరింక విసుగ్గా ముఖం ఇటు ఉప్పకుంది.

అది చూసి చిలక విసురుగా అటు తిరిగింది.

తుమ్మెదలన్నీ గాలిలో హాయిగా ఒప్పుల గుప్ప తిరుగుతున్నాయి. చిలకకి కులుకు వచ్చి నవ్వుకుంది.

ఏమిటో ఈ కులుకు నవ్వులూ - ఆ చోద్యపు చూపులూను? గోరింక విసవిస లాడింది.

ఒక్కమారు రెక్కలు టపటప కొట్టుకొని రివ్వున గూడువదిలి బయటికి ఎగిరిపోయింది.

"చెప్పా పెట్టకుండా ఎక్కడికి వెళ్ళినట్లు? ఎంతసేపట్లో వచ్చేటట్లు? ఇంతేనా, నేను కూడా ఈ ఇరుకు గూట్లో కాపురం ఏమిటని ఎగిరిపోవచ్చా అయితే!"

తుమ్మెద ఒకటి ఝుమ్మని రొదచేస్తూ వచ్చి చిలక ఆలోచనలకి అంతరాయం కలిగించింది. "మా గూటిమీదికి వచ్చి ఇలా రొద చెయ్యవచ్చా? అందులో గోరింక గూట్లో లేని సమయంలో? అయ్!" అంటూ చిలుక మొదట విసుక్కుంది. కాని, తర్వాత ఆ తుమ్మెదే ఝుమ్మంటూ ఎగిరివెళ్ళి మల్లెపువ్వు మీద వాలేసరికి "ఏదో దాని ధోరణి దానిది. నన్ను అల్లరిపెట్టాలని రాలేదన్న మాట! ఏమైనా తుమ్మెద తుంటరిది. ఎవరికీ దానిమీద మంచి అభిప్రాయం లేదు" అంటూ సమాధానపడింది. దూరాన చకోరపక్షి వెన్నెల రాకకోసం ఎదురుచూస్తూ కనిపించేసరికి చిలక్కి నవ్వు వచ్చింది.

"ఆకలివేస్తే పండోఫలమో వెతుక్కోవాలి కాని, కిరణాలతో ఆకలి తీరుతుందా, ఈ చకోరపక్షి వెర్రిగాని?" అనుకొంది.

అవునుగాని - ఈ గోరింక ఇంకా రాలేదేవిటి? మబ్బుకన్నెలు వయ్యారంగా పరుగులు పెడుతున్నాయి. ఉండుండి నవ్వుల జల్లులు కురిపిస్తున్నాయి. వచ్చే చినుకూ పోయే చినుకూ, అపైన చీకటి! పైగా, తను ఏమంత రంగని? చీకట్లోవస్తే ఆ రంగులో కలిసిపోతుంది కూడాను!

ఇలా అనుకుంటూ గర్వంగా ఆకుపచ్చని తన వంటికేసి చూసుకొని మురిసిపోయింది చిలక.

ఆ సమయంలో పాలపిట్ట కూత వినిపించింది. "ఊ....ఎంత గర్వంగా కూస్తోంది? తనకే, నీలిరంగు వళ్ళు వుందికదా అని గొప్ప. ఎలాగైతే!" అనుకుంటూనే గూట్లోంచి బయటికి తొంగి చూసింది. ఎదురుగుండా వున్న చెట్టు కొమ్మమీద కూర్చుని, అది ఊగుతూంటే, ఠీవిగా ఊగుతూ పాటలు పాడుతోంది పాలపిట్ట. ఏమిటా గొప్ప? ఎందుకా పాటలు? ఇంతకీ ఇదంతా తన రంగు చూసుకునా, తను కూర్చున్న కొమ్మ అందం చూసుకునా? ఏవైనా ఈ పాలపిట్టకి ఠలే గర్వం! మూతి తిప్పుకుంది చిలక.

అయినా, పాలపిట్టకేసి మళ్ళీ మళ్ళీ చూడకుండా ఉండలేకపోతోంది. పోకిరీ పాటలు పాడితే పాడిందిగాక, దీని అందమే అందం! తన జతగాడు గోరింకతో పోల్చిచూస్తే, పాలపిట్ట అందగాడు కాదు మరీ!

చిలకకి వస్తూన్న ఆలోచనలన్నీ చెదరగొట్టేస్తూ మావిడి గుబురులోంచి కోకిల ఒకటి "కూ....కూ..." అంటూ పంచమ స్వరంతో పాట ప్రారంభించింది. "ఊ....ఈ సమయంలో ఈవిడగారి కూత ఒకటి. ఆలోచనలు ఏవీ సాగకుండా. తన గొంతు విన్న వాళ్ళకి మతిపోవాలనే చెడుబుద్ధి కాకపోతే ఏమిటిది?....ఓయ్ కోకిలా! గొంతు చూసుకుని ఏం మురిసిపోతావు కాని, ముందు నీ రూపం చూసుకో" అంది కళ్ళు తిప్పుతూ.

అంతలోనే నవ్వుకుంది.

కోకిల గొంతు చూసి తను ఈర్ష్య పడడం ఎందుకు? కావాలంటే తనూ పాడొచ్చు. చక్కని రూపం, అందుకు తగ్గ చక్కని పలుకూను తనది. ఎంత మందో తనని పలికించి పలికించి పులకించిపోతారు.

ఇలా సరిపెట్టుకొనేసరికి చిలక్కి కోకిలమీద అసూయ పోయింది. మళ్ళీ పాలపిట్ట రూపం మనస్సులో మెదిలి, ఇటు తిరిగి చూసింది. కొమ్మమీంచి పాలపిట్ట ఎప్పుడో ఎగిరిపోయింది. కొమ్మ చిన్నబోయింది.

కోకిల ఇంకా కూస్తూనే వుంది. దానికి జవాబుగా ఇంకో గుబురులోంచి మరో కోకిల "కూ....కూ" అంటోంది. దాని మురిపానికి దీని ముచ్చట. రెండూ కలిసి ఎంత బాగా కూస్తున్నాయి! పక్కని గోరింక లేదే? ఉంటే విని ఎంత సంబరపడును!....ఏమో, సంబరపడునో....లేదో. అయినా, తనకి వున్న, పాటలు విని పరవశించిపోయే మనస్సు వుండొద్దూ?

గర్వంతో కళ్ళు తిప్పుకొని ముక్కుతో రెక్కలు సర్దుకుంది.

దూరం నుంచి గుళ్ళో గంటలు గణగణమని మ్రోగాయి. ధ్వజస్తంభం చివరనున్న చిరుగంటలు కూడా గాలికి కదిలి ఘల్లుమన్నాయి. చిలకగుండెలు ఝల్లుమన్నాయి. కళ్ళు అరమోడ్పులై మనస్సంతా ఒక పూలమందిరంలా మారి, తెలియని ఆనందంతో ఆ గూట్లో కురికింది చిలక రాణి. ఘల్లుఘల్లు మంటూన్న చిరుగంటల సవ్వడితోపాటు గుడిగూళ్ళలోవున్న పావురాయిల గుడు.... గుడు శబ్దంకూకూడా కలిపి వినిపించేసరికి తనలో తను కులుకుతున్న చిలక తలతిప్పి మెడజాపి గుడికేసి చూసినది. రెక్కలు టపటపలాడిస్తూ ఒక్కొక్క పావురాయీ తనచుట్టూ తాను గుండ్రంగా తిరుగుతోంది. మెడని వెనక్కి గూట్లోకి లాక్కుని కిసుక్కుని నవ్వింది చిలక.

ఇంతలోకే గోరింక వచ్చింది. మళ్ళీ అంతలోనే తుర్రుమంది వచ్చినట్టే వచ్చి వెళ్ళి పోయిందేవిటి? అంత పనేమిటి చెప్మా? విస్తుపోయింది చిలక. చిలక అలా విస్తుపోయి వుండిపోయింది. అంతలోనే మళ్ళీ వచ్చింది గోరింక. కోపంతో మూతి తిప్పుకొని అటు తిరిగి పడుకుంది చిలక.

గోరింక గూడు సవరిస్తోంది. ఏమిటో చూద్దామని కొద్దిగా కళ్ళు తెరచింది చిలక. గూడంతా కాంతితో వెలిగిపోతోంది. వెంటనే చీకటి. ఇదేం చిత్రం!

గోరింక గర్వంగా ముక్కుతో రెక్కలు పొడుచుకుంటూ మధ్యలో విలాసంగా చూసింది. చిలక మెల్లగా దగ్గరకు వచ్చి "ఇదేం చిత్రం?" అంది, తన ముక్కుని మక్కువతో గోరింక మెడమీద చేరుస్తూ.

కళ్ళు కాంతితో వెలుగుతూంటే, గోరింక నవ్వి "చిత్రమే మరి! చూడు. ఎలా వెలిగి ఆరుతుందో....దీపం పెట్టాను గూట్లో, రాత్రంతా చీకట్లో వుంటావని. ఏం బాగుందా?" అంటూ తన రెక్కతో చిలకని కప్పి కౌగలించుకోబోయింది.

వెలిగి ఆరుతూన్న ఆ చిత్రమైన దీపం ఏమిటో అర్థం కాక, ఏక ఆలోచిస్తూ మధ్య మధ్య దానికేసి పరీక్షగా చూస్తూ ఇదీ అని నిర్ణయించుకోలేక

పోతున్న చిలక్కి, గోరింక సరసం విసుగనిపించింది. అందుకే చిరాగ్గా చూసి దూరంగా జరిగింది.

తనెంతో ప్రేమగా దగ్గరికి వస్తే దూరంగా జరుగుతుందేవిటి? తనంటే ఇష్టంలేదా? ఇష్టంలేంది జత ఎందుకు కట్టింది? "ఈ చిలక నా కోసం వెంపర్లాడుతోంది, నా చెలిమికోసం చుట్టూ తిరుగుతోంది అనే కదా, సావాసగాళ్ళు ఎంతమందో 'వలసపోదాం వస్తావా' అంటే నేను రాను పొమ్మని ఈ చిలకతో వుండిపోయింది! అంతేనా? ఎంతే కష్టపడి, గూడు కూడా కట్టింది. తను గూడు కట్టడంలో కూడా సాయం చేస్తున్నట్టు నటించిందేకాని, నిజానికి ఇది ఏం సాయం చేయలేదు. పోనీ, ఏదో కోరుకున్న చిన్నదికదా అని, తను ఎన్నో విధాల సర్దుకుపోతుంటే ఇంత నిర్లక్ష్యమా దీనికి? తనంటే లక్ష్యంలేనిదానితో తనకి కాపురం ఏమిటి? ఎక్కడికేనా ఎగిరిపోదామా అనుకుంది గోరింక - కాని అప్పటికి బయట వానజోరు ఎక్కువయింది. ఆ వానలో బయటికి వెళ్ళలేక ఆమట్టునే అటు తిరిగి పడుకుంది గోరింక.

గోరింక అలా విసుగ్గానూ కోపంగానూ వుంటే చిలకకూడా దిగులుగానూ విచారంగనూ వుంది. నల్లని గోరింకతో తనకి జోడు.... ఇటూఅటూ రెక్కఆడించడానికి వీలులేని అతి చిన్నగూడు ఇంతకంటే మంచి జోడూ, గూడూ తనక్కి దొరక్కపోనా!.. అవతలవాన....వానలో తడుస్తూ చలికి వణుకుతూన్న గొంతుకతో వుండుండి అరుస్తోంది కాకి.... గూట్లోకూడా అలాగే వుండుండి వెలుగుతోంది మినుకు మినుకు మంటూన్న దీవం. దానికేసి పరిశీలనగా చూసేసరికి అర్థం అయిపోయింది చిలక్కి అదేవిటో. ఓస్! మిణుగురుపురుగా? తను చెప్పకపోతే తెలియదనుకుంది కాబోలు! చూశావా కనుక్కున్నాను అన్నట్టు గర్వంగా చూసింది గోరింకకేసి.

కాకి ఇంకా బయట వానలో అరుస్తూనే వుంది. అబ్బ! ఈ వేళప్పుడు ఏమిటా అరుపు, ఇవతల వాళ్ళకి ఆలోచన ఏం తోచకుండాను? విసుక్కుంటూ, బయటికి చూసింది చిలక. ఎదురుగుండా కొమ్మమీద కూచున్న కాకి, మీద వానచినుకు పడ్డప్పుడల్లా అరుస్తోంది. గూడు లేదు కాబోలు! ఉన్నా పుడకలతో కట్టింది. అదేమంత గూడని? ఎండా వానా గూట్లోనే వుంటాయి. గూడంటే, చిన్నదయితేనేం, తమదీ గూడు! ఇంచక్కా ఒక్క చినుకయినా లోపలికి చొరకుండా - చలికాలంలో మరీ బాగుంటుంది వెచ్చగా....

పాపం, తన కోసం ఎంతో శ్రమపడి ఈ గూడు కట్టింది గోరింక! తను ఏం సాయం చేసిందనీ? పైగా, ఇంత చిన్న గూడేవిటి అని విసుక్కుంటోంది. ఎలాగైనా తనంటే గోరింకకి వల్లమాలిన ప్రేమ! చిలక ఒక్కమారు వళ్ళంతా వయ్యారంగా కదుపుకుంది. కళ్ళతో నిండుగా గోరింక కేసి చూసింది. నిద్ర పోతోంది కాబోలు!

వాన పెద్దదవుతోంది - గూట్లోకి జల్లు వచ్చి, గోరింకమీద వానపడు తుందేమో? గోరింక దగ్గరగా జరిగి, వానపడకుండా గోరింకమీద ఓ రెక్క కప్పుదాం అనుకుంది. ఇంతలో పెద్ద మెరుపుమెరిసి ఉరుము ఉరిమింది. చిలక్కి గుండెలదిరాయి. గోరింకకి దగ్గరగా జరిగింది. జరుగుతూనే అటుగా చూసింది.

కాకి ఇటే చూస్తోంది. ఛీ....ఏమిటా వేషాలు? పోనీ అని పెద్ద అందమైందా తెలివైందా? నల్లగా పెద్ద ముక్కు తనూను. నా జతగాడూ నలుపేకాని, అది కాకి నలుపుకాదు. అందులో అందం వుంది. ముక్కు కూడా ఇంచక్కని పసుపు పచ్చ రంగులో చూడముచ్చటగా ఉంటుంది. మళ్ళీ ఒక మారు అటు కాకికేసీ ఇటు గోరింకకేసీ చూసింది. చూసి, వెంటనే ఒక రెక్క గూటికి తలుపులా అడ్డు పెట్టి, మరో రెక్కతో గోరింకని కప్పింది చిలక.

ఊరికే నిద్రపోతున్నట్టు కళ్ళు సగం మూసుకుని వుందికాని, గోరింక అంతా గమనిస్తూనే వుంది. ఎందుకో చిలక దిగులుగానూ ముభావంగానూ వుంటోంది. నవ్వించినా కవ్వించినా కదలిక ఏం కనిపించడంలేదు. తన చిన్ననాటి కబుర్లు చెప్పింది. పలకరించి చూసింది. గూట్లో దీపం పెట్టింది. ఆ దీపం కోసం వానలో కూడా వెళ్ళి వచ్చింది ఉహూ! ఏం చేసినా చిలక ముఖం విచారంగానే వుంది. చిలక చురుగ్గా లేకపోతే తనకి ఏం బాగోలేదు. చిలకలో చురుకు కలిగించాలంటే....కలిగించాలంటే....ఆ ...

ఇలా గోరింక ఓ నిర్ణయానికి వస్తూన్న సమయంలో, చిలక తనకి దగ్గరగా, ఇంకా దగ్గరగా జరిగింది. జరుగుతూనే ఓ రెక్కని గూటికి అడ్డంపెట్టి మరో రెక్కతో తనని కప్పింది. చిలక తన దగ్గరగా రావడం, వచ్చి తనని రెక్కతో కప్పడం గోరింకకి ఎంలో సుఖంగా, హాయిగా, ఆనందంగా వుంది. ఇప్పుడు తను లేచి చిలకని తన సందిట్లోకి తీసుకుంటే....?కాని,తను మెళకువగా వున్నట్టు తెలిస్తే, చిలక సిగ్గుపడి దూరంగా కూర్చుంటుందేమో!

గోరింక భయపడ్డట్టే అయింది. చిలక అటుగా జరిగి రెక్కలు ముడుచుకుని కూర్చుంది. గోరింక ఎన్ని కబుర్లు చెప్పినా, ఎంతగా బతిమాలినా చిలకలో చలనం రాలేదు, కదలిక లేదు. చిలకలో సరదా, చురుకూ కలిగించాలంటే ఇందాకా తను ఆలోచించిందే మంచి ఉపాయం.... ఆ.... అంతే....

"ఇలారా! నీకు చెవిలో ఒక మంచి మాట చెప్తాను" అంటూ సైగచేసి పిలిచింది గోరింక.

చిలక ముఖం ఎత్తి చూసిందే కాని, దగ్గరకు రాలేదు.

గోరింకే చిలక దగ్గరికి జరిగింది. జరిగి చెవిలో రహస్యం చెప్పసాగింది. మొదట్లో అయిష్టంగా వుంది కాని, గోరింక చెప్పింది పూర్తి అయ్యేసరికి చిలక ముఖం విప్పారింది.

"నిజంగా?!" అంది ఆనందంతో మెరుస్తూన్న కళ్ళని మరింత పెద్దవి చేసి చూస్తూ.

"ఊ ... నిజంగానే!" అంది గోరింక, చిలక ముఖంలో కనిపించిన ఆనందాన్ని తనివితీరా చూసుకుంటూ.

''ఎప్పుడు వెళదాం తోటలో విందుకి?'' సంతోషంతో రెక్కలు టపటపలాడిస్తూ అడిగింది చిలక.

''తెల్లవారనీ.... వెళదాం - అయితే....నువ్వక్కడ జాగ్రత్తగా వుండాలి. అక్కడికి పెద్ద పెద్దవాళ్ళు చాలామంది వస్తారు. నిన్ను నువ్వు మరిచిపోయి విచ్చలవిడిగా తిరిగినా టక్కుటమారాలుచేసి హొయలుగా నడిచినా అంతా నిన్నే చూస్తారు.... ఏం తెలిసిందా?''

చిలక బుద్ధిగా తల ఊపి "అక్కడ అస్సలు మాట్లాడకూడదా?" అని అడిగింది బేలగా.

''అంత భయపడవలసిన అవసరంలేదు. మన చుట్టుప్రక్కల వాళ్ళు కూడా వస్తారు, వాళ్ళతో నువ్వు సరదాగా వుండొచ్చు. ఎరగనివాళ్ళతో మాట్లాడకు - అంతే!'' అంది గోరింక.

చిలక ఆనందం అంతా ఇంతా కాదు. తోటలో విందుకి ఎప్పుడూ చూడనివారూ, ఊహించనివారూ వస్తారు. ''హంసగారు వస్తారా? మరి నెమలిగారో?....'' ఇలా ఏవేవో వివరాలు అడగాలనుకుంది. కాని, అప్పటికే గోరింకకి కునుకు

పట్టింది. ఆ రాత్రి చిలకకి నిద్రేపట్టలేదు. హంసా నెమలీవంటి పెద్ద పెద్దవాళ్ళని ఇంచక్కా చూడొచ్చు. ఇంకా ఎంతమందో వస్తారు. వాళ్ళతో హాయిగా రోజంతా గడపవచ్చు తోటలో విందుట! ఎవరు చేస్తారు చెప్మా?.... ఎవరేమిటి? తోటే చేస్తుంది విందు! తన ఆలోచనకి నవ్వుకుంది చిలక.... ఏక ఆలోచనలు.... ఒక దాని తర్వాత ఒకటి.... ఎడతెరిపి లేకుండా వస్తున్నాయి.... ఆలోచనలతో నిద్ర పట్టలేదు ఎటు తిరిగి పడుకున్నా....

వాన తగ్గుముఖం పట్టింది తెల్లారుతూన్నది కాబోలు, కోడికూత వినిపించింది. క్రమ క్రమంగా చుట్టుప్రక్కల చెట్లమీద పక్షుల కలకలం ఎక్కువైంది. పిచుకలూ కోకిలలూ గొంతు సవరించుకొంటున్నాయి. ఇంకా గోరింక నిద్ర పోతూనే వుంది. ముక్కుతో సుతారంగా కదిపి లేపింది చిలక. గోరింక వళ్ళు విరుచుకుంటూ లేచింది, అందంగా బద్ధకం తీర్చుకుంటూన్న గోరింకని చూస్తే చిలక్కి ముచ్చటేసింది అందుకే కళ్ళు అప్పగించి అలా చూస్తూ వుండి పోయింది.

''మనం తొందరగా బయలుదేరాలి. నువ్వు ఈలోగా తయారవు. వాళ్ళంతా ఏం చేస్తున్నారో చూసి వస్తాను'' అంటూ గూట్లోంచి తుర్రుమని వెళ్ళి పోబోతూన్న గోరింకని చిలక అడ్డగించింది. ''ఇలాగేనా వెళ్ళిపోవడం? కాస్త రెక్కలు దులుపుకో'' అంది. గోరింక గుర్రుగా చూసింది.

చిలక ఊరికే తన చుట్టూ తను తిరుగుతూ, కూనిరాగాలు తీస్తూ ముక్కుతో రెక్కల్ని సవరించుకుంటోంది.

అది చూసి గోరింక ''చాల్లే సింగారం! మరీనూ. వచ్చిన వారంతా నీకేసే చూడాలనా?'' అంది.

అంతే-కోపంతో బుంగమూతి పెట్టింది చిలక. "ఎరక్కపోయి అన్నాను కదా!'' అనుకొని, కోపం తగ్గేదాకా బతిమాలుతూ కూర్చుంది గోరింక. తర్వాత చిలకాగోరింకా ఇద్దరూ బయలుదేరారు....నెమ్మదినెమ్మదిగా చెలికాండ్రు కూడా వచ్చి కలిశారు. అంతా బారులుతీరి ఎగురుతూ మనసులో మాటలు చెప్పుకుంటూ ముందుముందుకి సాగుతున్నారు.

తూర్పుదిక్కున ఎర్రని సూర్యకాంతి - చుట్టూ కళ్ళకి విందుగా పూచిన పూలూ, కాసిన కాయలూ పచ్చని ప్రకృతి. ఇవన్నీ మనవే-మనకోసమే అన్నట్లు

ఆనందంగా అలా అలా ఎగురుకుంటూ వెళుతూవుంటే, నేలమీద కెరటాలతోనూ నురుగులతోనూ ఎగసిఎగసి ప్రవహిస్తూన్న సెలయేరు కనిపించింది. అంతే! చటుక్కున అక్కడ నేలమీదకి దిగిపోయింది చిలక. గోరింక వెనకాలే వెళ్ళి "ఇదేవిటి ఇక్కడికి వచ్చి వాలావు? వాళ్ళంతా వెళ్ళిపోతున్నారు" అంది.

"వెళితే వెళ్ళనీ, మన ఇద్దరం ఇక్కడ ఈ ఏట్లో నీళ్ళోసుకుని మరీ వెళదాం" అంది చిలక.

కాదంటే మళ్ళీ ఏం గొడవో - ఏం కోపమో—

సరే అని ఒప్పుకుంది గోరింక.

చిలక స్నానం చేస్తూంటే గాలి ఈల వేసింది. చిలక్కి వళ్ళంతా పులకరించింది. వయ్యారాలుపోతూ చాలసేపు స్నానంచేసి ఇవతలకి వచ్చింది. అంతవరకూ అలా కూర్చుని వుంది గోరింక. తన వళ్ళంతా ఆరబెట్టుకుంటూ, "నువ్వు నీళ్ళోసుకోవేం?" అనడిగింది చిలక.

"నాకి అడుగడుగు స్నానాలు కిట్టవ్."

"అందుకే అలా నల్లగా వున్నావు" అంటూ తన ఎర్రని ముక్కుతో చిలక వెక్కిరించింది.

"ఇదిగో ఎకసక్కేలు వెక్కిరింపులూ తర్వాత - ముందు బయలుదేరు" అంది ఓర్పు తగ్గిపోతూంటే గోరింక విసుగ్గా.

వళ్ళంతా ముక్కుతో సరిజేసుకొని చిలక బయలుదేరేటప్పటికి, లేదంటే ఇంకో ఝాములో సగంసేపు పట్టింది.

చిలకా గోరింకా ఊసులాడుకుంటూ ఎగురుతూ వెళుతూవుంటే, కింద నేలమీద మనుష్యులంతా చీమల్లాగ కనిపించసాగారు "పాపం, వీళ్ళకి మనలాగ స్వేచ్ఛ లేదుకదా! రోజూ తిండికోసం బట్టకోసం ప్రాకులాడ్డంతోటే సరిపోతుంది. ఆ రెండూవున్నా డబ్బు వెర్రి వదలదు. డబ్బు సంపాదించాలనే తాపత్రయంతోటే బతుకు తెల్లారిపోతుంది ఈ మనుష్యులికి, పాపం!" అంటూ నోటితో చప్పరించి జాలిపడింది చిలక.

"జాలీ,దయా బాగానేవున్నాయిలే. మనం ఇంకొంచెం వేగం పెంచకపోతే, మరీ ఆలస్యంగా చేరుకుంటాం. అందరూ ఈ పాటికి వచ్చేసి వుంటారు." కసురుకుంది గోరింక.

జామి తోట ఒకటి పళ్ళతో కలకల్లాడుతూ కనిపించింది చిలక్కి. అక్కడికి వెళ్ళి, వాలి, ఆ జామి పళ్ళు రుచి చూడాలనిపించింది. కాని, గోరింక ఇప్పటికే విసుగ్గా వుంది. అందుకే వచ్చిన కోరికని చిలక బయటపెట్టలేదు. అలా ఎగిరి ఎగిరి ఎగిరి విందు జరుగుతూన్న తోటకి చిలకా గోరింకా చేరుకొనే సరికి ఝాము పొద్దెక్కింది.

ఆలస్యంగా రావడంతో అంతా వాళ్ళకేసే చూశారు. అందరి కళ్ళూ తమని గుచ్చిగుచ్చి చూస్తుంటే చిలక్కి సిగ్గేసింది.

రకరకాల పళ్ళన్నీ తోటమధ్యలో గుట్టలు గుట్టలుగా పడివున్నాయి. ఓ పక్కని రకరకాల ధాన్యం గింజలు, మరో పక్కన తేనెలూరుతున్న రంగు రంగుల పువ్వులూ, తామర తూండ్లూను పక్కనే కొలనూ కొలనులో నీళ్ళూ. విందు సిద్ధంగా వుంది.

అయితే చిలక ఆశించిన సరదా సంతోషం ఏం అక్కడలేదు. ఒకరితో ఒకరు కబుర్లు చెప్పుకోవడం, అంతా సరదాగా తిరగడం, నవ్వుకుంటూ, తుళ్ళుకుంటూ విందారగించడం - ఇదేమీ లేదు. ఎంతసేపటికీ ఎవరిగొప్ప వాళ్ళు ప్రదర్శిస్తూ గర్వంగా, ఠీవిగా అటూ ఇటూ తిరుగుతూ ఉండడం. పక్కవాళ్ళని పలకరిస్తే తమ గొప్ప ఎక్కడికి పోతుందో అని ముభావంగా వుండడం, మధ్య మధ్య ఓ పండో గింజో రుచిచూస్తూ వుండడం. అందరూ ఒక చోటికి చేరిన సరదా లేదు. ఎవరి మానాన వాళ్ళు ఎవరి లోకంలో వాళ్ళు ఉన్నారు.

పెద్ద పెద్ద బండలమీద నెమళ్లు నాట్యం చేస్తున్నాయి.

పక్కనే కొలనులో హంసలు ఈదుతున్నాయి.

చెట్లకొమ్మలమీద కూర్చుని కోకిలలు పాడుతున్నాయి.

చిలకలు నాలికలతో ఉచ్చరిస్తూ మద్దిల దరువులు వేస్తున్నాయి.

ఉడతలు కూస్తూ తోకాడిస్తూ చెట్లకొమ్మలమీద పరుగులు తీస్తున్నాయి.

పిచుకలు కిచకిచమంటూంటే, పాలపిట్టలు పల్టీలు కొడుతున్నాయి.

పావురాళ్ళు గుడ గుడ మంటూ ఒకటే శబ్దం చేస్తున్నాయి.

ఇవేం పట్టనట్టు కొంగలు మెడలు ఊపుకుంటూ అడుగులు లెక్కపెట్టు కుంటూ కదులుతున్నాయి.

వడ్రంగి పిట్టలు చెట్టు బెరళ్ళని ముక్కుతో పొడుస్తూ మధ్య మధ్య అరుస్తున్నాయి.

ఎవరి గొడవ వాళ్ళది. ఎవరిలోకం వాళ్ళది.

ఒకరినొకరు పలకరించుకోవడం లేదు. ఒకరి గొడవ ఒకరు పట్టించుకోవడంలేదు. ఎవరు మట్టుకు వాళ్లే మేం గొప్ప అంటే మేం గొప్ప అన్నట్టు వున్నారు. ఇలా గర్వంగా ముభావంగా వుండేకాడికి అంతా ఒకచోటికి జేరడం ఎందుకు? ఎవరి గూట్లో వాళ్లుంటే పోలే? చిలక్కి చిరాకేసింది. ఉత్సాహం. సరదా అంతా నీళ్ళుకారిపోయింది. ఇంత శ్రమపడి రాకుండా హాయిగా తమ గూట్లో కూర్చుంటే బాగుండిపోను. అదే నయం హాయిగా ఇంతకంటే. 'వెనక్కి మన గూటికి ఎగిరిపోదాం పద' అని గోరింకతో అందామని పక్కకి చూసింది. పక్కని గోరింక లేదు! ఎక్కడికెళ్ళింది? ఏమైంది? ఇంకో చిలకతో దేనితోనైనా మంతనాలు సాగించడం లేదుకదా! ఇంత విందులో, ఇంత మందిలో, ఎక్కడని వెతకడం?....చిలక మనస్సు ఏక కంగారు పడసాగింది.

గాలి విపరీతంగా వీస్తోంది. మేఘాలు పరిగెడుతున్నాయి. గాలీవానా వస్తుందేమో? ఈలోగా గూటికి జేరితే మంచిది. చిలక కళ్ళు గోరింకకోసం ఏక వెతుకుతూనే వున్నాయి. ఎవర్ని అడగడం? ఎవరూ పలకరు. ఎవరూ చెప్పరు తన గోరింక ఎక్కడుందో. పైగా అందరూ కొత్త తనకి. చిలక్కి భయంతో గుండెలు అదరసాగాయి. నేరకపోయి వచ్చానుకదా ఈ విందుకి అనుకుంది. గోరింక కనిపిస్తే రివ్వున వెనక్కి తమ కూటికేసి ఎగిరిపోవాలని వుంది.

అదిరే గుండెలతో బెదిరే కన్నులతో తోట తోట అంతా వెదకసాగింది. హమ్మయ్య! ఓ చోట పాలపిట్టతో కబుర్లు చెబుతూ కనిపించింది తన గోరింక. దూరాన్నే నిలబడి "ఇలారా" అని కళ్ళతోటి సంజ్ఞ చేసింది. "వస్తున్నా.... వస్తున్నా" అందే కాని ఎంత సేపటికీ కబుర్లు పూర్తిచేసి రాలేదు గోరింక.

ఇంతలో ఎక్కడ నుంచి వచ్చిందో ఒక కోతి వచ్చి, విందుకోసం సిద్ధం చేసిన పళ్ళనీ గింజల్నీ చెల్లాచెదరుచేసేసి, పక్షులన్నింటినీ చెదరగొట్టేసి, చెట్టు కొమ్మలు పట్టుకుని కోతి కొమ్మచ్చులాడుతూ ఊగి చివరకి పళ్ళికిలించి అందర్నీ వెక్కిరించి మరీ వెళ్ళింది.

అన్ని పక్షులతోపాటు చిలక కూడా భయపడి చెట్లకొమ్మలచాటున ఆ అల్లరి అంతా పూర్తయేవరకూ దాక్కుంది. పూర్తి అయాక "అమ్మయ్య!"

అని ఇవతలికి వచ్చి, గోరింక రెక్కపుచ్చుకుని తన గూటికేసి ఎగిరిపోసాగింది. ''విందు పూర్తి కాకుండానే....ఏం?... ఇదేం నచ్చలేదా?....సరే నడు....హంసనీ, నెమలినీ చూశావా....?" అంటూ గోరింక చిలకతో ఊసులాడుతూ ఎగురుతోంది.

''నెమలికీ, హంసకీ లేని గాడు, కొంగకీ కోతికీ వుంది'' అంది చిలక.

''లోకం తీరే అంత....'' ఇలా కబుర్లు చెప్పుకుంటూ చిలకా, గోరింకా తమ గూటికి చేరారు.

అప్పటికి మేఘాలు దట్టంగా వ్యాపించి చల్లని గాలివీస్తూ, సన్నని జల్లు ప్రారంభం అయింది.

''వెచ్చగా హాయిగా మన గూడే బాగుంది'' అంది చిలక, ఒక రెక్కని గూటికి తలుపుగా అడ్డంపెట్టి మరో రెక్కతో గోరింకని కప్పుతూ....

తనకి దగ్గరిగా జరిగిన చిలకని, మరింత దగ్గరగా తీసుకుంది గోరింక.

తనకి నచ్చిన గూట్లో, తాను మెచ్చిన జతగాడి సందిట్లో పరవశంతో ఒదిగిపోయింది. ఆపైన కరిగిపోయింది ఆనంద లోకాల అవదుల్లో, సమస్త ప్రపంచాన్నీ మరచిపోయిన చిలక - గోరింక గుండెలనిండా మధురంగా నిండిపోయిన పంచదార చిలక ఉలక్కుండా, పలక్కుండా, అందిన ఆనందంతో తృప్తిపడింది, కోర్కెల రెక్కల్ని మధురమైన గూటిలాంటి మనస్సులోనే మడచుకొనే మధ్యతరగతి మహిళలా.... *

(ఆంధ్రజ్యోతి '85 ఉగాది సంచిక)